సాక్షి
రాజన్న సిరిసిల్ల
ఆదివారం | 2 | జూలై | 2023



చదువుకోండమ్మా: హోం వర్క్ చేయిస్తున్న తల్లి రజిత

త్వరత్వరగా: కొడుకుకు స్నానం చేయిస్తున్న సంధ్య



గుడ్ మార్నింగ్: పొద్దున్నే నిద్రలేస్తున్న తనీశ్, హన్సిక

హర్లినికి జడ వేస్తున్న రూబీ

తినునాన్నా: కొడుకుకు టిఫిన్ తినిపిస్తున్న శిల్ప

నడుచ్.. నడుచ్: కూతురుకు బ్యాగ్ వేస్తున్న హారిక

బైబై: స్కూల్‌కు వెళ్తున్న చిన్నారి

చలోచలో: పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్తున్న తల్లి

సండే స్పెషల్

అమ్మే ఆది గురువు

- పిల్లల చదువుల వెనక తల్లి శ్రమే ఎక్కువ
- నిద్రలేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకు..
- ఆలనలో అగ్రభాగం అమ్మే..
- హోంవర్క్‌లో పూర్తి భాగస్వామ్యం

లే నాన్నా.. స్కూల్‌కు టైం అవుతోంది.. త్వరగా రెడీ కావాలంటూ.. దుప్పట్లోంచి పిల్లల్ని బుజాలపై ఎత్తుకెళ్లి బ్రష్ చేయించి.. స్నానం పోస్తుంది. స్కూల్ యూనిఫాం తొడిగి.. టిఫిన్ తినిపించి.. లంచ్‌బాక్స్, బుక్స్‌ను బ్యాగులో సర్దుతుంది. గేటు బయటివరకూ తీసుకెళ్లి బడికి పంపిస్తుంది. పిల్లలు సాయంత్రం వచ్చేసరికి స్నాక్స్ సిద్ధం చేస్తుంది. వారు ఆడుకుంటుంటే స్నేహితురాలిగా.. హోంవర్క్‌లో టీచర్‌గా మారుతుంది. అలిసిపోయిన పిల్లలకు మళ్లీ అన్నం తినిపించి గుండెలపై పడుకోబెట్టుకుని అప్పుడు నిద్రపోతుంది అమ్మ.

పిల్లలను స్కూల్‌కు పంపించడం అంత సులువేం కాదు. కాళ్లకు చక్రాలు కట్టుకున్నట్లు చకచకా పిల్లల్ని సిద్ధం చేస్తేనే వారు సమయానికి పాఠశాలకు వెళ్తారు. కొంచెం పెద్దవాళ్లయితే పర్లేదుగానీ.. 5– 10ఏళ్ల వారిని రెడీ చేయడం తల్లులకు నిత్యం ఒక టాస్క్. గృహిణులకు కొంత ఉపశమనం ఉంటున్నా.. ఉద్యోగులు, ఇతర పనులకు వెళ్లేవారు పోటీ పడాల్సిందే.

వేకువజాము నుంచే..

తల్లులకు వేకువజాము మేల్కొనడంతోనే పనులు మొదలవుతాయి. ఇంటి పనులు త్వరగా పూర్తి చేసి.. పిల్లలకు నీళ్లు వేడి చేయడం.. స్నానాలు చేయించడం, దుస్తులు వేయడం, టై, బెల్టు పెట్టడంతోపాటు పలక, బలపం బ్యాగులో సర్దడం కూడా తల్లులే చేస్తున్నారు. పిల్లలు చిన్నవాళ్లు అయితే పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలు బ్యాగులో ఉన్నాయా..? లేవా..? పెన్సిల్ వంటివి సరిచూసి బ్యాగు సిద్ధం చేయడం కూడా తల్లుల వంతే. వారు పాఠశాలకు వెళ్లాక దుస్తులు శుభ్రం చేయడం నుంచి దుస్తులు ఇస్త్రీ చేయడం వరకు తల్లులే బాధ్యత తీసుకుంటున్నారు. చివరకు చుట్టాలు, ఇరుగు పొరుగు వారిని ఏయే వరుసలతో పిలవాలో నేర్పించేది తల్లే. పిల్లలకు ముందుగా వచ్చీరాని మాటల దగ్గర నుంచి మొదలుకొని సంస్కారవంతమైన చక్కటి అలవాట్లను నేర్పించడంలో తల్లి పాత్ర కీలకం.

ప్రతిరోజూ హోంవర్క్

పిల్లలు సాయంత్రం ఇంటికి చేరుకున్నాక వారితో హోంవర్క్ చేయించేది కూడా తల్లే. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలను ఒడిలో కూర్చోబెట్టుకొని హోంవర్క్ చేయిస్తున్నారు. సతాయిస్తున్నా.. సముదాయిస్తూ వారితో హోంవర్క్ పూర్తి చేయిస్తారు. పిల్లలు పెద్దవారైతే వారిని ట్యూషన్‌కు పంపించడం.. రాగానే ఏం చెప్పారో తెలుసుకోవడం.. పాలు తాగించడం.. ఇలా వారు నిద్రపోయే వరకూ అన్నీ తల్లే చూసుకుంటోంది.

తల్లికి సముచిత స్థానం

పిల్లల చదువుల్లో తల్లుల పాత్ర పెరగడంతో ప్రాథమిక స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయిలోనూ తండ్రి పేరుతోపాటు తల్లి పేరు కూడా ఫారాల్లో రాయాల్సిందిగా నిబంధనలు పెట్టారు. కొన్ని పాఠశాలల్లో తల్లుల పేర్లు, ఫోన్ నంబర్లను కూడా తీసుకుంటున్నారు. మాతృమూర్తి ప్రథమ గురువు అని చెప్పడమే కాదు, అక్షరసత్యం.

క్రమశిక్షణ అలవడుతుంది



పిల్లలకు ఇంటి వద్ద క్రమశిక్షణ నేర్పిస్తాం. మేం చేసే అలవాట్లే వారిని సరైన దారిలో పెట్టేందుకు ఉపయోగపడతాయి. మా పాప సహస్ర 6వ తరగతి చదువుతోంది. ప్రతి రోజు యూనిఫాంతోనే స్కూల్‌కు అటెండ్ అవుతుంది. అందుకు తగ్గట్టే నేను కూడా పాపను రెడీ చేస్తాను. రెండు జడలు వేయాలంటే 10 మార్కుల జవాబు రాయాల్సినంతా పని అవుతుంది. అయినా రెండు జడలు వేసి పంపిస్తాను. – కన్న శ్వేత, డాక్టర్ స్ట్రీట్

పిల్లలకంటే గంట ముందుగానే



మా పాప మేఘన అల్లునూర్‌లోని స్కూల్‌లో యూకేజీ చదువుతోంది. పిల్లల కంటే గంట ముందుగానే లేచి ఇంట్లో పని మొత్తం చేసుకుంటాను. పాప లేచాక స్కూల్‌లో దింపి వచ్చేవరకు ఏ పని చేయను. పిల్లలను లేపడం స్నానం చేయించి రెడీ చేయడం పెద్దపని. ఆ పనులు అయిపోతే మిగిలిన పనులు సులువుగా చేసుకోవచ్చు. – పంబాలు సంధ్య, అల్లునూర్

మేమే బడికి పోయినంత పని



మేం బోయవాడలో ఉంటాం. మా పాప రూప కొత్తపల్లిలోని స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. ప్రతిరోజు కమాన్ వరకు బైక్‌పై డ్రాప్ చేసి స్కూల్ బస్సు ఎక్కించి వస్తాను. పాప ఉదయం లేచినప్పటి నుంచి బస్ ఎక్కించేంత వరకు బిజీబిజీగా ఉంటుంది. మళ్లీ సాయంత్రం బస్సు కోసం వెయిట్ చేసి ఇంటికి తీసుకొస్తాను. ప్రస్తుత కాలంలో తల్లులే బడికి పోయినంత పని అవుతుంది.
– చకిలం స్వప్న, బోయవాడ

పిల్లల తరువాతే అందరూ



పిల్లలను బడికి పంపించడమే ఫస్ట్.. తర్వాతనే మిగిలివారు. వాళ్లను రెడీ చేసి బడికి పంపిస్తా. లంచ్ బ్రేక్‌కు టిఫిన్ రెడీ చేసి స్కూల్‌కు వెళ్లి తినిపించి వస్తా. నేను లంచ్ చేసే వరకు స్కూల్ టైం అయిపోతుంది. మళ్లీ స్కూల్‌కు వెళ్లి పాపను తీసుకొస్తాను. ఇలా రోజు గడుస్తుంది. మా పాప అల్లునూర్‌లో ఎల్‌కేజీ చదువుతోంది. – అట్ల మమత, అల్లునూర్

– సప్తగిరికాలనీ(కరీంనగర్), ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

న్యూస్‌రీల్

బహిరంగ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: మహాజన్ సంపర్క్‌లో భాగంగా 5వ తేదీన వేములవాడలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కోరారు. స్థానిక భీమేశ్వరగార్డెన్‌లో శనివారం అసెంబ్లీ పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా పదాధికారులతో సమావేశమయ్యారు. కేంద్రంలో మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ పథకాలను ఇంటింటికెళ్లి వివరించాలని సూచించారు.

భీమన్నగుడిలో ఘనంగా శనిత్రయోదశి వేడుకలు



నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

వేములవాడ: రాజన్న అనుబంధ భీమన్న గుడిలో శనివారం శనిత్రయోదశి వేడుకలు జరిగాయి. భక్తులు నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



మాట్లాడుతున్న గుండా థామోస్

కోనరావుపేట(వేములవాడ): ఎస్సీ వర్గీకరణ సాధనకు మాదిగలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గుండా థామోస్ కోరారు. మండలం మామిడిపల్లిలో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో 29 రాష్ట్రాలకు చెందిన మాదిగ, మాదిగ ఉపకులాలతో ఈనెల 6న హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని కోరారు. బడుగు రమేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ
- సిరిసిల్లలో రేడియాలజీ హబ్ ప్రారంభం



రేడియాలజీ హబ్‌ను ప్రారంభిస్తున్న అరుణ

సిరిసిల్ల: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరు వద్ద నిర్మించిన రేడియాలజీ హబ్‌ను శనివారం ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వర్చువల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అరుణ మాట్లాడుతూ ఆరోగ్య తెలంగాణ లక్ష్యంతో సీఎం కేసీఆర్ జిల్లాకో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశారని, జిల్లాలో మంత్రి కేటీఆర్ చొరవతో ప్రజలకు వైద్యపరంగా సకల వసతులు దరి చేరాయన్నారు. జిల్లా ఆస్పత్రిలో సీటీస్కాన్, మొబైల్ ఎక్స్‌రే, పిడియాట్రిక్స్ వెంటిలేటర్స్, ఆప్తాల్మిక్ మైక్రోస్కోప్, టిఫా స్కాన్, అల్ట్రాసౌండ్ స్కాన్, 2డీ ఏకో, ఫీటర్ డాప్లర్, ఆక్సిజన్ కాన్సంట్రేటర్స్, వర్టికల్ ఆటో క్లేవ్ మిషన్లు అందుబాటులోకి వచ్చాయని వివరించారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ వైద్యంపై పేదలకు నమ్మకం పెరిగిందన్నారు. జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, టీ–డయాగ్నోస్టిక్ ఇన్‌చార్జి రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రేడియాలజిస్టు ఉద్యోగానికి దరఖాస్తులు ఆహ్వానం

సిరిసిల్లటౌన్: జిల్లా ఆస్పత్రిలో రేడియాలజిస్టు పోస్టును కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తున్నట్లు సూపరింటెండెంట్ మురళీధర్‌రావు ప్రకటనలో తెలిపారు. ఫార్మసిస్టు పోస్టుకూ దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. అర్హులు ఈనెల 6న జిల్లా ఆస్పత్రిలో దరఖాస్తు ఫారంతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్‌లపై గెజిటెడ్ ఆఫీసర్‌తో సంతకం చేయించి ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.


వైజ్ఞానిక ప్రదర్శనకు రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంక్



ట్యాబ్‌లు అందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన రాష్ట్రస్థాయిలో 9వ స్థానంలో నిలిచింది. ఐదుగురు విద్యార్థులకు నిర్వాహకులు రూ.90 వేల విలువ గల ట్యాబ్‌లను అందించారు. పాఠశాల హెచ్‌ఎం బోయన్నగారి నారాయణ, గైడ్ టీచర్ సంపత్, ఉపాధ్యాయులు గోల్కొండ శ్రీధర్, పాశం భాస్కర్ పాల్గొన్నారు.

ధర్మగుండం శుభ్రం



ధర్మగుండంలో పరిశుభ్రమైన నీరు

వేములవాడ: ఇటీవల రాజన్న ఆలయంలోని ధర్మగుండం నుంచి దుర్గంధం వెదజల్లుతుందన్న విషయాన్ని సాక్షిలో ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ధర్మగుండంలోని మురికి నీటిని తొలగించి పరిశుభ్రమైన నీటిని నింపారు.





సిరిసిల్లలో హాల్‌టికెట్ నంబర్ చూస్తూ..



సిరిసిల్లలో పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్



పరీక్ష రాసేందుకు వచ్చిన దివ్యాంగుడు



ప్రశాంతంగా గ్రూప్-4 పరీక్షలు



ఎల్లారెడ్డిపేటలో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల: జిల్లాలో గ్రూప్–4 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సిరిసిల్ల, వేములవాడ, బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి మండలాల్లో 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో 14,011 మందికి పేపర్–1కు 11,846 మంది, పేపర్–2కు 11,803 మంది హాజరయ్యారు. కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పరిశీలించారు. జిల్లాలో 84.55 శాతం అభ్యర్థులు పరీక్షలు రాశారు. విధుల్లో 51 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 50 మంది లైజన్ ఆఫీసర్లు, 614 మంది ఇన్విజిలేటర్లు, 13 రూట్లలో 26 మంది రూట్ ఆఫీసర్లు పని చేశారు.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని పరీక్ష కేంద్రాలను అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పరిశీలించారు. జిల్లాలోనే అత్యధికంగా గాయత్రి పీజీ కళాశాలలో 840 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 135 మంది గైర్హాజరయ్యారు.

క్లుప్తంగా

కుక్కల దాడిలో 24 కోళ్ల మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన కోళ్లు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని మామిడిపల్లిలోని హోటల్ నిర్వాహకుడు లింగమూర్తి పెంచుకుంటున్న నాటుకోళ్లపై శుక్రవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. అర్ధరాత్రి కుక్కల మంద జాలికింద నుంచి లోపలికి వెళ్లి కోళ్లపై దాడి చేసి చంపాయి. ఈ దాడిలో 24 కోళ్లు చనిపోయాయి. ఇటీవల మనుషులపై సైతం కుక్కలు దాడులు పెరిగాయి.

బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్న వారిపై కేసు

- చిన్నారిని వెంటబెట్టుకపోయిన తండ్రి
- తీవ్రంగా హెచ్చరించిన పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించడమే కాకుండా వెంట చిన్నారిని తీసుకెళ్లిన వారిపై ఎల్లారెడ్డిపేట పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి శివారు ప్రాంతంలో గల వైన్‌షాప్ వద్ద బహిరంగ ప్రదేశంలో చిన్నపాపను పక్కన కూర్చోబెట్టుకొని మద్యం తాగుతున్న తండ్రి, ఇద్దరు మిత్రులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని తీవ్రంగా మందలించడమే కాకుండా, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతున్నందుకు కేసు నమోదు చేశారు.

దుర్గయ్యగౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య


పరామర్శిస్తున్న ఆగయ్య

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన గంట దుర్గయ్యగౌడ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా.. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హామీ ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న దుర్గయ్యగౌడ్ రోడ్డు ప్రమాదంలో మరణించడం దురదృష్టకరమన్నారు. ఆయన మృతితో కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి కేటీఆర్ సహకారంతో దుర్గయ్యగౌడ్ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. పర్శరాములు, రవి, రాములు, బాలయ్య ఉన్నారు.

సుద్దాలలో వన్యప్రాణుల వధ


సుద్దాల శివారులో ఏర్పాటు చేసిన వల

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాల గ్రామంలో కొన్ని రోజులుగా వన్యప్రాణుల వేట యథేచ్ఛగా కొనసాగుతోంది. సుద్దాలతోపాటు మంగళ్లపల్లి, మారుపాక శివారులోని సరిహద్దు ప్రాంతాల్లో పగటి పూట వలలు ఏర్పాటు చేస్తున్నారు. రాత్రి వేళల్లో కుక్కల గుంపులు, టార్చిలైట్లతో వచ్చి వన్యప్రాణులను వేటాడుతున్నారు. వలల్లో చిక్కిన నెమళ్లు, బుర్కపిట్టలు, కంజు పిట్టలను వేటాడుతున్నారు. వేటగాళ్ల చర్యలతో అటవీ ప్రాంతంలోని ప్రాణులు అంతరించిపోతున్నాయి. వేటగాళ్లు ఉన్నారని తెలియడంతో కొందరు వ్యక్తులు వెళ్లగా కత్తి, వలలను వదిలి పరారయ్యారు.

సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు

సిరిసిల్లక్రైం: సోషల్ మీడియాలో మహిళలను కించపరిచేలా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్ తెలిపిన వివరాలు. గంభీరావుపేట మండలంలోని మహిళలను అవమానించేలా అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఇరువర్గాల మధ్య గొడవలు సృష్టించేలా వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన మండల కేంద్రానికి చెందిన అబ్దుల్‌ఖాన్‌ను శనివారం అరెస్ట్ చేశారు. అతని మొబైల్‌ను సీజ్ చేసి కోర్టు అనుమతితో రిమాండ్‌కు తరలించారు. ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి పోస్టులు చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దండాలు రాజన్న



వేములవాడ: ఆషాఢంలోనూ రాజన్న దర్శనానికి భక్తులు భారీగా వస్తున్నారు. శనివారం వచ్చిన భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. ఈనెల 5న ఆలయ ఉద్యోగులు బోనాలు తీసేందుకు ఏర్పాట్లు చేశారు.

సండే స్పెషల్


నక్సలైట్లు ఇన్‌ఫార్మర్‌గా భావించి లక్ష్మి అనే మహిళ తల నరికి వేలాడదీసిన రుద్రంగి చౌరస్తా ఇదే..

రుద్రంగి.. వస్తోంది

- గాయాల ముల్లె.. ఆ పల్లె
- వెండితెరపై కల్లోల పల్లె కథ
- ఈనెల 7న విడుదల

రుద్రంగి రక్తచరిత్రకు సాక్ష్యం. నిత్య కల్లోలంతో పిడికెడు మట్టిని పిసికితే చారెడు కన్నీళ్లు రాలిన నేల. రాత్రయితే చాలు.. బిక్కుబిక్కుమంటూ గడిపిన క్షణాలు.. ఇక్కడ పెరిగిన చెట్టుకు.. ఎగిరే పిట్టకు.. పుట్టకు.. గుట్టకు.. కన్నీటి కథలు తెలుసు.. తుపాకీ మోతలు.. గాలిలో కలిసే ప్రాణాలు.. ఇందిరమ్మ బొమ్మ సాక్షిగా తలను వేరు చేయబడిన మొండెం కళ్ల ముందు కనిపించిన దృశ్యం.. అణచివేత... తిరుగుబాటుకు సాక్ష్యం రుద్రంగి. ఊరు పెద్దదే అయినా.. దొరలు, భూస్వాముల పీడనకు వ్యతిరేకంగా సాగిన పోరాటానికి చిత్రరూపమిస్తూ.. రుద్రంగి సినిమా రూపుదిద్దుకుంది. ఈ నెల 7న విడుదల కాబోతున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ ఇటీవల హైదరాబాద్‌లో జరిగింది. ప్రేక్షకుల ముందుకు రాబోతున్న రుద్రంగి సినిమాపై 'సాక్షి' ఈ వారం సండే స్పెషల్.. – సిరిసిల్ల

దాడులు.. ప్రతిదాడులు

మావోయిస్టు అగ్రనేత ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి రుద్రంగి స్కూల్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 2004లో ఉమ్మడి రాష్ట్రంలో నక్సలైట్లు, పోలీసుల మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో ప్రభుత్వం శాంతిచర్చలు జరిపింది. ఈ చర్చలు ముగియగానే శాంతిని భగ్నం చేస్తూ ఎదురుకాల్పులు జరిగింది ఇక్కడే. మావోయిస్టులకు, పోలీసులకు మధ్య జరిగిన కాల్పుల్లో ముగ్గురు నక్సలైట్లు మరణించారు. అంతకుముందు కొచ్చెగుట్ట వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు జనశక్తి నక్సలైట్లు మరణించారు. రుద్రంగి శివారులోని లింగంపేట వద్ద నక్సలైట్లు పేల్చిన మందుపాతరకు చందుర్తి ఎస్సై శ్రీనివాస్‌రావు మృత్యువాత పడ్డారు. చందుర్తి ఎంపీపీ గంగరాజంను నక్సలైట్లు ఇన్‌ఫార్మర్‌గా పేర్కొంటూ రుద్రంగిలో కాల్చిచంపారు. అంతకుముందు లక్ష్మి అనే మహిళను ఇన్‌ఫార్మర్ నెపంతో తల నరికి ఇందిరమ్మ విగ్రహానికి కట్టిన ఘటన అప్పట్లో సంచలనం. దాడులు, ప్రతిదాడులతో ఆ రుద్రంగి కన్నీటి ధారగా మారింది. పక్కనే దట్టమైన అడవి ఉన్న మానాల, మరిమడ్ల, వట్టిమల్ల, కలికోట, అంబారిపేట గిరిజనతండా, కొత్తపేట, లింగంపేట చుట్టూ ఊర్లతో రుద్రంగి కల్లోలమైంది. రుద్రంగిలో కొండాపూర్ ఎన్‌కౌంటర్ మృతుల పేరుతో జనశక్తి అమరవీరుల స్థూపం ఉంది. ఆ ఊరిపై ఉద్యమ గీతాలెన్నో జనబాహుళ్యంలోకి వెళ్లాయి.

ఎగిసి పడిన ఉద్యమాల ఖిల్లా

రుద్రంగి సలుపుతున్న గాయాలముల్లె. వలపోతల కన్నీటిధార. 1975 దశకంలో ఎగిసిపడిన నక్సలైట్ ఉద్యమ కెరటం. చుక్కనీరు దొరకని దైన్యం. నిరుద్యోగం నిచ్చెన మెట్లతో గల్ఫ్ దేశాలకు వలసపోయిన బతుకులు. భూస్వామ్యపు అణచివేతలు.. చుట్టూరా ఎత్తయిన గుట్టలు.. గుట్ట కింద కుప్ప పోసినట్లుగా ఉండే ఇళ్లు. అందులో తాతల నాటి పెంకుటిండ్లే ఎక్కువగా కనిపిస్తాయి. గల్ఫ్ సిరులు తెచ్చిన బిల్డింగులు.. పదిహేను వేల జనాభాతో ఉన్న ఆ పల్లె రుద్రంగిగా వెండితెర కెక్కింది. రుద్రంగి ఒకప్పుడు సిరిసిల్ల నియోజకవర్గంలో పెద్ద ఊరు. నేడు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ నియోజకవర్గంలో ఓ మండల కేంద్రం. పసుపు, వరి, మొక్కజొన్న, పత్తి పంటలతో ఆ పల్లె ఇప్పుడు పసిడి రాశులతో కళకళలాడుతోంది.





ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో బాలకృష్ణ, జగపతిబాబు, రసమయి బాలకిషన్


రుద్రంగి సినిమాలోని ఓ సన్నివేశం

నిర్మాత మనోడే..

రుద్రంగి పేరుతో వస్తున్న ఈ సినిమాను 1960–90 ప్రాంతంలో జరిగిన సంఘటనలు, భూస్వామ్య వ్యవస్థ నేపథ్యంలో చిత్రీకరించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఈ చిత్రానికి నిర్మాత కాగా, అజయ్ సామ్రాట్ దర్శకత్వం వహిస్తున్నారు. జగపతిబాబు, ఆశీష్‌గాంధీ, విమలారామన్, మమతా మోహన్‌దాస్ ప్రధాన పాత్రల్లో ఈ సినిమా రూపుదిద్దుకుంది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ సినిమాలకు రైటర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న అజయ్‌సామ్రాట్ దర్శకుడు కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. 'రుద్రంగి నాది.. రుద్రంగి బిలాంగ్స్ టు మి' అంటూ జగపతిబాబు చెప్పె డైలాగ్ గంభీరంగా ఉంది. జాలి, దయ లేని భీమ్‌రావు దొరగా జగపతిబాబు నటిస్తున్నారు. మొత్తానికి రాజన్న సిరిసిల్ల జిల్లాలో అనేక ప్రత్యేకతలు ఉన్న మేజర్ గ్రామం రుద్రంగిని వెండితెరకు ఎక్కించడం విశేషం. ఆ సినిమా ఎలా ఉంటుంది.. రుద్రంగి టైటిల్‌తో ఏం చెబుతారో అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఈనెల 7న విడుదలకు సిద్ధమైంది. ఇటీవల ఈ సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్ హైదరాబాద్‌లో జరిగింది. ప్రముఖ హీరో బాలకృష్ణ ఈ వేడుకల్లో పాల్గొన్నారు. సిరిసిల్లకు చెందిన వెల్దండి వేణు దర్శకత్వంలో ఇటీవల వచ్చిన 'బలగం' సినిమా విజయవంతం కాగా.. రాజన్న సిరిసిల్ల జిల్లా నేపథ్యంలో మరో సినిమా 'రుద్రంగి' వెండితెరపైకి రావడం విశేషం.

మా ఊరిలో నేను ఒక్కడినే నటించాను



మా సొంతూరు రుద్రంగి. మా ఊరి పేరుతో వస్తున్న సినిమాలో నాకు నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ సినిమాపై మా ఊరి అందరిలో ఆసక్తి పెరిగింది. మరో ఐదు రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రుద్రంగి రాబోతుంది. ఆ సినిమాను వెండి తెరపై చూస్తేనే ఆసక్తిగా ఉంటుంది.

– తోకల తిరుమల్, రుద్రంగి యువకుడు

అక్రమ వ్యాపారాలు మానేయాలి

- జిల్లాలో 14 బృందాలతో ఏకకాలంలో తనిఖీలు
- నగదు, ప్రామిసరీ నోట్స్ స్వాధీనం
- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: జిల్లాలో సామాన్యుల నుంచి అధిక వడ్డీ వసూలు చేస్తున్న వారు ఇక నుంచి తమ అక్రమ వ్యాపారాలు మానుకోవాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగిన పోలీసుల దాడులకు సంబంధించిన వివరాలను శనివారం వెల్లడించారు. జిల్లాలో 14 బృందాలుగా విడిపోయిన పోలీసులు.. వడ్డీవ్యాపారులు, చిట్‌ఫండ్స్ నిర్వాహకుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, ప్రామిసరీ నోట్స్ వివరాలు తెలిపారు. రూ.13,95,120 నగదు, రూ.4,19,09,250 విలువ గల 113 చెక్కులు, 71 మంది బాధితులు సంతకం చేసిన ఖాళీ చెక్కులు, ఒక చెక్‌బుక్, 14 ప్రామిసరీ నోట్స్, ఆరు ల్యాండ్ రిజిస్ట్రేషన్ కాగితాలు, డబ్బు లెక్కించే యంత్రం, రోజువారీ చిట్టీ డబ్బులు వసూలు చేసే చిన్నబుక్కులు, రిజిస్టర్‌లను సీజ్ చేసినట్లు ఎస్పీ వివరించారు.

పలువురిపై కేసులు

సిరిసిల్లకు చెందిన పబ్బా నాగరాజు నుంచి రూ.2,80,14,250 విలువ గల 67 చెక్స్, 10 మంది బాధితులు సంతకం చేసిన ఖాళీ చెక్కులు, రూ.4 లక్షల నగదు పట్టుకున్నట్లు తెలిపారు. బూట్ల నవీన్ కుమార్ వద్ద 3 ల్యాండ్ రిజిస్ట్రేషన్ పేపర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మచ్చ కొండయ్య వద్ద రూ.1,31,50,000 విలువ గల 42 చెక్కులు, ఇద్దరు సంతకం చేసిన ఖాళీ చెక్కులు, ఒక ప్రామిసరీ నోట్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పాలకొండ శివప్రసాద్ నుంచి రూ.7.45 లక్షల విలువ గల నాలుగు చెక్స్, 41 మంది బాధితులు సంతకం చేసిన ఖాళీ చెక్కులు, ప్రామిసరీ నోట్స్, 3 ల్యాండ్ రిజిస్ట్రేషన్ పేపర్స్ పట్టుకున్నట్లు చెప్పారు. వేములవాడటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో.. దూస దశరథం నుంచి 18 చెక్కులు, డబ్బులు లెక్కించే యంత్రం, ఖాళీ రిజిస్టర్, రెండు బ్యాంకు పాస్‌బుక్కులు, ఒక చిట్‌ఫండ్ ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ బుక్, వ్యాపార లావాదేవీలు చేసే వ్యక్తుల పేర్లతో ఉన్న పుస్తకం, రూ.9,95,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

బైండోవర్ అయిన వారిలో..

నిబంధనలు అతిక్రమించి వ్యాపారాలు చేస్తున్నారని సిరిసిల్లకు చెందిన వంగారి లక్ష్మణ్, గట్టు నారాయణ, కసానిగొట్టు శ్రీనివాస్, అనుగుల ప్రభాకర్, వేములవాడకు చెందిన పెద్ద బాలరాజు, కటకం కిషన్, కొమురవెల్లి శేఖర్, ముద్రకోల వెంకటేశం, కటకం శ్రీనివాస్‌లను పోలీసులు బైండోవర్ చేశారు.

నిబంధనలు పాటించాలి



నిబంధనలకు లోబడి వ్యాపారాలు చేసుకోవాలి. అధిక వడ్డీకి అప్పులు, తిరిగి వసూలుకు ఇబ్బందులు గురిచేసే వారిపై కఠిన చర్యలకు వెళ్తాం. నిబంధనలు పాటించకుండా వ్యాపారాలు చేసే వారి వివరాలను జిల్లా పోలీసు కార్యాలయంలో, డయల్ 100లో చెప్పవచ్చు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం.

– అఖిల్ మహాజన్, ఎస్పీ

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం


గాంధీచౌక్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రజక సంఘం నాయకులు

సిరిసిల్ల: సీఎం కేసీఆర్ చిత్రపటానికి సిరిసిల్లలో శనివారం రజక సంఘం ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలోని రజకులకు శాశ్వత ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టులపై జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టు పనికి ఇంతకాలం రిజర్వేషన్ లేకపోవడంతో ఇతర కులాల వారు కాంట్రాక్టులు పొంది మళ్లీ రజకులతో కూలీ పని చేయించే వారని రజక సంఘం నాయకులు తెలిపారు. ఇన్నాళ్లకు ప్రభుత్వ సంస్థల్లో బట్టలను ఉతికే కాంట్రాక్టులను రజకులకు కేటాయించడం హర్షనీయమన్నారు. సిరిసిల్ల పట్టణ రజక సంఘం అధ్యక్షుడు వేములవాడ బాలయ్య, ఉపాధ్యక్షుడు దండు శ్రీనివాస్, బండి మల్లేశం, వొడ్నాల విక్రమ్, మారుపాక శ్రీనివాస్, కాసర్ల లచ్చయ్య, బండి శ్రీనివాస్, చిట్యాల మధు ఉన్నారు.

నల్లా నీళ్లు రాక పరేషాన్ అవుతున్నాం

- నామాపూర్‌లో గ్రామస్తుల ఆందోళన


గ్రామపంచాయతీ వద్ద ధర్నా చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ఆరు నెలలుగా నల్లా నీళ్ల సమస్య తీరుతలేదు.. నాలుగు రోజులకోసారి వచ్చే నీళ్లతో ఎట్లా బతికేది.. అంటూ నామాపూర్ గ్రాపంచాయతీ ఎదుట ఎస్సీ కాలనీవాసులు శనివారం ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ గ్రామంలో 2, 3 వార్డులలో ఆరు నెలలుగా నీళ్లు సరిగ్గా రావడం లేదన్నారు. సర్పంచ్‌కు, పంచాయతీ సార్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. మహిళలు పొలాల దగ్గర, బోరుబావుల వద్ద తెచ్చుకుంటున్నారన్నారు. కోతులు, కుక్కలు దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్, కార్యదర్శికి మధ్య సమన్వయం లేకనే నీటి సమస్య పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. రెండు గంటలకు పైగా ఆందోళన చేయగా.. అధికారులెవరూ రాకపోవడంతో పంచాయతీ కార్యాలయం తలుపులకు వినతిపత్రం అంటించి వెళ్లారు. ఆందోళనలో మాదాసు అనిల్, శాగల లక్ష్మణ్, బైండ్ల రామస్వామి, కర్నె నర్సింలు, ఆరె లక్ష్మీపతి, ఈసరి రాములు, బిట్ల అనిల్, చంద్రం పాల్గొన్నారు.

ఖండాంతరాల్లో ఉద్యమ గాయకుడికి నివాళి


నివాళి అర్పిస్తున్న అంబేద్కర్ సేవాసమితి ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగులశాఖ చైర్మన్ సాయిచంద్ అకాల మృతిపై ఖండాంతరాల్లో విషాదం నెలకొంది. ఒమన్‌లో శుక్రవారం రాత్రి సీబ్ మబేలా బల్దియా క్యాంపులో అంతర్జాతీయ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిగాని రాజు ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. సాయిచంద్ తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్రను కొనియాడారు. సమితి ప్రతినిధులు మేడిపట్ల లక్ష్మణ్, నీరటి అశోక్, జుబేర్‌పాషా, రంజిత్, అక్తర్, సుభాష్, మధు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న నాయకులు

వేములవాడలో నివాళి

వేములవాడ: తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో సాయిచంద్ తన గొంతుకతో ఉద్యమానికి ఊపిరినిచ్చారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. సాయిచంద్ మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. పట్టణంలోని మల్లారం రోడ్డులోని తన కార్యాలయంలో ఇటీవల సాయిచంద్ చిత్రపటానికి శనివారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జెడ్పీ మాజీ చైర్మన్ తీగల రవీందర్‌గౌడ్, ఏఎంసీ చైర్మన్ మిర్యాల ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న సేవలో స్వచ్ఛభారత్ కన్వీనర్



స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

వేములవాడ: రాజన్నను బీజేపీ స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ అన్నమనేని శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులతో కలసి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం నాగిరెడ్డి మంటపంలో వేదోక్త ఆశీర్వచనం గావించారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి


కాముని వనిత

సిరిసిల్లటౌన్: ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలను ప్రభుత్వం వెంటనే తగ్గించాలని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత డిమాండ్ చేశారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అసంబద్ధ విధానాలతోనే ధరలు పెరిగాయని వెంటనే అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్యులు ఏమి కొనలేని పరిస్థితులు తీసుకొచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతారన్నారు.

ధరలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయించాలి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: పెరిగిన ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన కార్మికుల బడ్జెట్ కేటాయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. మధ్యాహ్న కార్మికుల సమస్యలు తీర్చకుంటే సమ్మె తప్పదని హెచ్చరిస్తూ యూనియన్ ఆధ్వర్యంలో డీఈవో ఆఫీసులో శనివారం వినతిపత్రం అందించారు. కార్మికులకు వేతనాలు రూ.2వేలు పెంచుతున్నట్లు స్వయంగా సీఎం కేసీఆర్ ప్రకటించి 11 నెలలు గడుస్తున్నా అమలు కావడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 54 వేల మంది మధ్యాహ్న కార్మికుల జీవితాలతో సర్కారు ఆటలాడుకుంటుందన్నారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు .. ధరణిపై దేవతలు

సిరిసిల్లటౌన్: ధరణిపై నడయాడే దేవతలుగా వైద్యులను కొనియాడారు వక్తలు. అంతర్జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా సిరిసిల్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం డీఎంహెచ్‌వో ఆఫీసు, జిల్లా ఆస్పత్రిలో కార్యక్రమాలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ మురళీధర్‌రావుతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులను సన్మానించారు. లయన్స్‌క్లబ్ అవతరణ దినోత్సవం సందర్భంగా హాస్పిటల్‌లో రోగులకు అన్నప్రసాదం, పండ్లు పంపిణీ చేశారు. పోస్టల్ వర్కర్స్ డే సందర్భంగా తపాలాశాఖ ఉద్యోగులను సన్మానించారు. చార్టర్డ్ అకౌంటెంట్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఏలను సన్మానించారు. సిరిసిల్ల లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నగునూరి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బచ్చు భానుచందర్, కోశాధికారి శ్యామసుందర్‌రెడ్డి, గుగ్గిళ్ల జగన్‌గౌడ్, అనంతుల శివప్రసాద్, నాగశంకర్, పవన్, అమర్, రవి, బుడిమె శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


వైద్యులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు